


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం డిసెంబర్ 5 2025 | సంపుటి : 2 | సంచిక : 61 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## ఆదిలాబాద్‌కు వరాల జల్లు

- ఎయిర్‌పోర్టు నిర్మించి..పరిశ్రమలు రప్పిస్తాం
- యూనివర్సిటీ ఏర్పాటుకు తక్షణ హామీ
- సిమెంట్ పరిశ్రమను తెరిపించి యువతకు ఉద్యోగాలు
- రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన
- ఆదిలాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ వెల్లడి

**ఆదిలాబాద్,డిసెంబరు4 :** ఆదిలాబాద్ జిల్లాకు సిఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు ప్రకటించారు. ఎయిర్ పోర్టు, యూనివర్సిటీ, తుమ్మడిహట్టి ద్వారా నీళ్ల తీసుకొచ్చే బాధ్యత తనలదని ప్రకటించారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఏడాదిలోపు ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభిస్తామని వ్యాఖ్యానించారు. వరంగల్‌తో పాటు ఆదిలాబాద్‌కు అన్ని రకాల వసతులతో కూడిన ఎయిర్‌పోర్టు ఉండాల్సిందేనని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు వస్తే ఆదిలాబాద్‌కు పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఎర్రబస్సే కాదని.. ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు కూడా తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఆదిలాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం ప్రసంగించారు. ఆదిలాబాద్ అభివృద్ధి బాధ్యత నేనే తీసుకుంటానని చెప్పుకొచ్చారు. ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్ బస్‌ను దించి.. పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏడాది తిరిగేలోపు ఆదిలాబాద్‌లో విమానాశ్రయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేసిన అనంతరం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ ప్రభుత్వాన్ని సాగనంపారు.

మిగతాద్ది 2 లో




## గుర్తింపు కోసం నేను పనిచేయను..

### రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని శాసించనున్న ఎఐ

- 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి ప్లాన్
- వేయికోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తాం
- క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్
- నీతి ఆయోగ్ క్వాంటం సదస్సులో భట్టి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్,డిసెంబరు4 :** రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ గురించి దేశం చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్ కి హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్ లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం.. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.. 1000 కోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు.

మిగతాద్ది 2 లో




## ఎసిబి వలలో ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్

### దాదాపు వందకోట్ల ఆస్తుల గుర్తింపు

హైదరాబాద్,డిసెంబరు4(ఆర్ఎన్ఎ): అక్రమాస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. దాదాపు వందకోట్ల ఆస్తులు ఉన్నట్లుగా గుర్తించారు. ఏడీ శ్రీనివాస్ నివాసం, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో భారీగా ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు.

2 లో



## పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేం - హైకోర్టు

**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు ఇవాళ తీర్పు వెలువరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది.




## హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోసం

- పారిశ్రామికవేత్తలకు భూములుకట్టబెట్టే కుట్రలు
- బిఆర్ఎస్ రాగానే ఈ పాలసీని రద్దు చేస్తాం
- ఎవరైనా పెట్టుబడి పెడితే నష్టపోక తప్పదు
- జీడిమెట్ల పారిశ్రామిక కారిడార్‌ను సందర్శించన కెటిఆర్

02

**హైదరాబాద్,డిసెంబర్ 3 :** హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 లక్షల కోట్ల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నది బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్‌ఆరోపించారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు రేవంత్ సర్కార్ ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు.



## బీజాపూర్‌లో మరోసారి ఎదురుకాల్పులు.. 19కి చేరిన మావోయిస్టుల మృతులు

2లో..

## బాలు విగ్రహాన్ని అడ్డుకోవడం దారుణం

- రోశయ్య, బాలసుబ్రమణ్యం ఒకప్రాంతం వారు కాదు
- బిఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలు ఆపాలి
- రోశయ్య వర్ధంతి సభలో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్,డిసెంబర్ 3 :** తెలంగాణ సెంటిమెంట్‌తో భారత రాష్ట్ర సమితి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదనిమహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని రవీంద్ర భారతిలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభలో మహేష్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. సెంటిమెంట్ రగల్చి బీఆర్ఎస్ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేవుళ్ల విషయంలో సీఎం ఒక సామెతగా చెప్పారని.. దాన్ని రాజకీయం చేయడం తగదన్నారు.

మిగతాద్ది 2 లో



## పర్యాటక కేంద్రంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి

- తద్వారా స్థానికుకలు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు
- ప్రజల కష్టాలు తెలిసన వ్యక్తి సిఎం రేవంత్
- ఆదిలాబాద్ పర్యనటనలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**ఆదిలాబాద్,డిసెంబరు4 :** మినీ కాశ్మీర్ గా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. తద్వారా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని హామీనిచ్చారు.పేదలు కష్టాలు తెలిసిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు.

2లో..

## పంచాయతీ ఎన్నికలు.. తొలి విడతలో 395 గ్రామాలు ఏకగ్రీవం

**హైదరాబాద్:** తెలంగాణలో తొలి దశ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిన్నటితో ముగిసింది. ఈ క్రమంలో 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 9,331 వార్డులు ఏకగ్రీవమైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.




తొలి విడతలో 8,095 సర్పంచి అభ్యర్థులు, 9,226 వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకొన్నారు. ఈ నెల 11న తొలి విడతలో మిగిలిన 3,836 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

## బాలుడిపై వీధి కుక్కల దాడి.. నివేదిక కోరిన ఎస్‌హెచ్‌ఆర్‌సీ




2 లో



మిగతాది 2లో

## రైళ్లలో కర్పూరం వెలిగిస్తే.. మూడేళ్ల జైలు శిక్ష

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం డిసెంబర్ 5 2025

# హిల్ట్ పాలసీ పేరుతో కాంగ్రెస్ భారీ భూ కుంభకోసం

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ఈ పాలసీని రద్దు చేస్తామని, అవసరమైతే దీనికోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్సులు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని ధ్వజమెత్తారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల ఇండస్ట్రియల్ పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావని, ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు, ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తున్నదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు, పాఠశాలలు, దవాఖానలు, చివరికి స్మశానాలకు స్థలం లేదు.. కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ 9300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూళ్లు, హాస్పిటళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదిలిపెట్టదని, కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణంపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలోని కాలనీల ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని చెప్పారు. అనుముల రేవంత్ రెడ్డి కాదని, అవినీతి అనకొండ అని విమర్శించారు. 9300 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసి లక్షల కోట్ల రూపాయలు దోచుకొని ఢిల్లీకి మూటలు పంపడానికి చేస్తున్న ఈ స్కామ్ ను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. హిల్ట్ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల విలువచేసే ప్రజల భూమిని కాపాడే దాకా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని వెల్లడించారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై తాము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయిందంటూ ప్రభుత్వం బాధపడుతున్నదని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీడిమెట్ల ప్రాంతంలో గజానికి మార్కెట్ ధర లక్ష రూపాయలుగా ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం రూ.4000కే భూమిని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతున్నదని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి ఇది నిదర్శనమన్నారు. భూముల దోపిడీ ఆర్నెళ్లుగా జరుగుతున్నదని, పాలసీ ఇప్పుడు బయటకు వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవలన్నారు.

# ఆదిలాబాద్‌కు వరాల జల్లు

మొదటిపేజీ తరువాయి

ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి రెండుకళ్లుగా భావిస్తూ ముందుకెళ్తున్నాం. రెండేళ్లుగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నా. చిన్న వయసులోనే నాకు గొప్ప అవకాశం దక్కడం.. ప్రజల దీవెన, దేవుడి సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు విపక్ష ఎమ్మెల్యేలను ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా అనుమతించలేదు. ఎమ్మెల్యేలను కూడా సచివాలయంలోకి రాకుండా అడ్డుకున్న ప్రభుత్వాన్ని గత పదేళ్లలో చూశాం. ఏ ఆశయంతో సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. గత పదేళ్లలో అది నెరవేరలేదు. రాష్ట్ర అభివృద్ధికి తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంటరీ రూపొందించాం. పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈనెల 8, 9న గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం అని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి స్ఫూర్తిగానే గత ప్రభుత్వంపై నేను పోరాటం ప్రారంభించానని అన్నారు. అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరుల స్థూపం పర్యాటకంగా అభివృద్ధి చేసే దస్త్రంపై సంతకం పెట్టాను. ఆదిలాబాద్‌కు సాగునీరు అందేలా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును వైఎస్ఆర్ చేపట్టారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. మూడేళ్లకే కాళేశ్వరం కూలింది. ప్రజల సొమ్ము దోచుకుని అక్రమ సొమ్ము కోసం ఇవాళ ఆ కుటుంబంలో గొడవలు పడుతున్నారు. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తాం. ఎన్నికల ఉత్సవం పూర్తి కాగానే మరో 40వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని సీఎం హామీ ఇచ్చారు.తమ్మిడిహట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్టితీరుతామని స్పష్టం చేశారు.ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తానే వస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయని వివరించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిని పర్యాటక కేంద్రంగా మారుస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే ఆదిలాబాద్‌కు మళ్లీ వస్తానని.... రోజంతా సమస్యలపై సమీక్షిస్తానని తెలిపారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యూనికేషన్‌లో ఆదిలాబాద్ అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఆదిలాబాద్‌లో తప్పకుండా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ ఎక్కడ కట్టాలో స్థానిక నేతలంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇంద్రవెల్లిలో యూనివర్సిటీ కడితే బాగుంటుందని తన భావన అని తెలిపారు. అనుమతి మాత్రమే తనదని.. ఎక్కడ కట్టాలో నిర్ణయం మీదేనని చెప్పుకొచ్చారు. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. రాబోయే రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. మన యువత ఐఏఎస్, ఐపీఎస్‌లు అయినప్పుడే తనకు సంతోషమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాగా చదువుకుని తెలంగాణ ఖ్యాతిని దశదిశలా చాటాలన్నారు. సర్పంచ్‌లను చూసి ఎన్నుకోవాలని, పనిచేసే వారికే అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, తదితరులు సభలో పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి

గతంలో పాలించిన కేసీఆర్ పుణ్యమా అని ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందన్నారు. రూ. 8 లక్షల కోట్ల రూపాయల అప్పుల చేస్తే.. దానికి ప్రతీ నెల ప్రజా ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు.. ఇవాళ ఆదిలాబాద్ లో రూ. 260.45 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆదిలాబాద్ లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ కు పునాదిరాయి వేసుకున్నాం అని జూపల్లి వివరించారు. ఆదిలాబాద్ లో ఏయిర్ పోర్టు ఏర్పాటుకు 700 ఎకరాల భూసేకరణ కోసం సీయం ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా 61 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. రానున్న రోజుల్లో మరో 40 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. చనాక- కొరాట బ్యారేజ్ నిర్మాణాన్ని పూర్తి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పదేండ్లలో ఒక ఎకరానికి కూడా సాగునీరు ఇవ్వలేకపోయింది. చనాక -కొరాట బ్యారేజ్ పెండింగ్ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని హామీనిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పంటనష్టం ఇవ్వలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల పంటనష్టం ఇస్తుంది. మిగిలిన రైతులకు నివేదిక ఆధారంగా పంటనష్టం చెల్లిస్తాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేయోచ్చో.. రెండేళ్లలో చేసి చూపించాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్ ? నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు రూ.21 వేల కోట్లకు పైగా రుణమాఫీ, సన్నాలకు రూ. 500 బోనస్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. బలమైన ఆర్థిక రాష్ట్రంగా నిలదొక్కుకోవడానికి, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి తెలంగాణ రైజింగ్ ? 2047 విజన్ డాక్యుమెంట్ ను ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రపంచ స్థాయిలో రాష్ట్రం అగ్రగామిగా ఉండేందుకు లక్ష్యాలను నిర్దేశిరచనున్నాం. క్రీడలు, పర్యాటకం, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రకృతి వ్యవసాయం ఇవన్నీ కూడా రాష్ట్ర పాలసీలో భాగంగా ముందుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

# ఎసిబి వలలో ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి

మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు.. రాయదుర్గం మైహోంభుజలో ప్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, అనంతపురంలో 11 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు, నారాయణపేటలో రైస్ మిల్లు, 3 ప్లాట్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. సోదాల్లో రూ.5లక్షల నగదు, 1.6 కిలోల బంగారం, 770 గ్రాముల వెండి, 2 కార్లు, పలు పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో కొనసాగుతున్న రెండో విడత కొనసాగు తున్నస్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ పక్రియలో భాగంగా నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ గురువారం పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ విధానాన్ని నామినేషన్ దరఖాస్తుల ఆమె సమీక్షించారు.నామినేషన్ పక్రియ పారదర్శకంగా, దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగించేందుకు అవసరమైన సలహాలు,సూచనలు అధికారులు,సంబంధిత సిబ్బందికి ఇచ్చారు.అదనపు కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనివాస్,ఎంపిఓ రవీంద్ర ప్రసాద్,గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి

# ఇండిగో విమానానికి బాంబు బెదరింపు
## హైదరాబాద్ విమానం అహ్మదాబాద్‌కు మళ్లింపు

షార్జా నుండి హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాన్ని అత్యవసరంగా అహ్మదాబాద్‌కు మళ్లించారు. ఈ సంఘటన ప్రయాణికులలో, విమానాశ్రయ అధికారులలో కలకలం సృష్టించింది. ఇండిగో విమానానికి సంబంధించిన అధికారులకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు అందింది. విమానంలో మానవ ఐఈడీ ఉన్నట్లుగా ఈ మెయిల్ ద్వారా బెదిరించినట్లు తెలిసింది. బెదిరింపు రాగానే అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, విమానాన్ని దాని గమ్యస్థానం హైదరాబాద్‌కు కాకుండా అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మళ్ళించారు. అహ్మదాబాద్‌లో విమానం ల్యాండ్ అయిన వెంటనే, ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. అనంతరం భద్రతా సిబ్బంది బాంబు స్క్వాడ్‌తో కలిసి విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఇండిగో విమానాలకు బాంబు బెదిరింపులు రావడం ఇది రెండవసారి. గతంలో, కువైట్ నుండి హైదరాబాద్‌కు రావాల్సిన మరో విమానానికి బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో, ఆ విమానం ఉదయం 7:45 గంటల ప్రాంతంలో ముంబై ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. అప్పుడు కూడా ప్రయాణికులను దించి, బాంబు డిస్పోజల్ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించాయి.

# పాతబస్తీలో యువకుడి దారుణ హత్య
## రియల్ వ్యాపారి జునైద్‌గా గుర్తింపు

హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. రెయిన్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి కత్తి పోట్లతో పడి ఉన్నట్లు పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు బాధితుడిని హుటాహుటిన సంతోష్‌నగర్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. అయితే తీవ్రంగా గాయపడిన సదరు వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు పాతబస్తీ రెయిన్ బజార్‌కు చెందిన మహమ్మద్ జునైద్ (30)గా గుర్తించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన జునైద్‌ను కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు విచక్షణారహితంగా కత్తులతో పొడిచారని.. తీవ్రంగా గాయపడిన జువైద్‌ను ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడని పోలీసులు తెలిపారు. అనంతరం జునైద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ మొదలుపెట్టారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. అయితే నిందితులు, బాధితుడు ఇద్దరూ కూడా బంధువులే అని అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్ సుందర్ తెలిపారు. జువైద్‌ను ఎందుకు హత్య చేశారనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ వెల్లడించారు.

# వార్డు మెంబర్ గెలుపుకోసం నానా తంటాలు
## - భార్యను గెలిపిస్తే ఫ్రీ కటింగ్ అంటూ ప్రచారం

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఓట్ల పండగలో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు కోతులను తరిమిస్తామని హామీ ఇవ్వగా, కొందరు రకరకాల హామీలు ఇస్తున్నారు. పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని అన్ని పంచాయతీ, గ్రామ, వార్డు పరిధిలో ఎన్నికల హీట్ పెరిగిపోయింది. ప్రధాన పార్టీలు బలపరచిన సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులు ప్రచారం హోరాహోరీగా సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లను ఆకర్షించేందుకు వివిధ రకాల ఆఫర్లు ప్రకటిస్తున్నారు. డబ్బు పంచడం ఓ ఎత్తు అయితే.. కొందరు చీరలు, వివిధ రకాల వస్తువులను బహుమతిగా అందిస్తున్నారు. ఈ క్రమంలో ఓ వార్డ్ మెంబర్ ఎన్నికల ప్రచారం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. తన భార్యను వార్డు మెంబర్‌గా గెలిపిస్తే.. ఐదేళ్ల పాటు ఫ్రీగా కటింగ్ చేస్తానని ఆమె భర్త ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ చక్కర్ల కొడుతోంది..నా భార్యని వార్డ్ మెంబర్‌గా గెలిపిస్తే మగవారందరికీ కంటింగ్, షేవింగ్ ఫ్రీగా చేస్తానని ఓ భర్త వినూత్న ప్రచారం చేస్తున్నాడు.

# పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేం

మొదటిపేజీ తరువాయి

చట్టప్రకారం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.

# బాలు విగ్రహాన్ని అడ్డుకోవడం దారుణం

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ కోసమే కిషన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆరోపించారు. హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులో వస్తాయని మహేష్ గౌడ్ వెల్లడించారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుందని తెలిపారు. అవినీతికి అలవాటు పడ్డ కేసీఆర్ కుటుంబం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అని ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ విమర్శించారు.

ఘనంగా.. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభను రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్
కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, జగ్గారెడ్డి, వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల్ శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి నేతలు నివాళులర్పించారు. రోశయ్య వర్ధంతి సందర్భంగా వి.హనుమంతరావును రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సత్కరించింది. అలాగే రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ స్కాలర్ షిప్‌లు అందజేశారు.

# రైళ్లలో కర్పూరం వెలిగిస్తే.. మూడేళ్ల జైలు శిక్ష

మొదటిపేజీ తరువాయి

రైళ్లలో కర్పూరం వెలిగిస్తే కఠిన శిక్షలు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా శబరిమలకు వెళ్లే యాత్రికులు రైలులో పూజ సందర్భంగా కర్పూరం వెలిగించకూడదని సూచిస్తున్నారు. రైల్వే నిబంధనల ప్రకారం ఇది నేరమని వివరించారు. రైళ్లలో కర్పూరం వెలిగిస్తే.. రూ.1,000 వరకు జరిమానా, లేదా మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రెండు శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.
శబరిమల రైళ్లలో భక్తులు కర్పూరం వెలిగిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా రైళ్లలో కర్పూరాన్ని వెలిగించడం నిషేధమన్నారు. రైలులో అగ్గిపుల్ల వెలిగించినా నేరమేనని చెప్పారు. ఇలాంటి చర్యలపై ప్రయాణికులు టోల్‌ఫ్రీ నంబరు 182కు ఫోన్ చేసి, సమాచారం అందించాలని ఓ ప్రకటనలో కోరారు.

# బాలుడిపై వీధి కుక్కల దాడి.. నివేదిక కోరిన ఎస్‌హెచ్‌ఆర్‌సీ

మొదటిపేజీ తరువాయి

నగర శివారులోని హయత్‌నగర్ శివగంగా కాలనీలో 8 ఏళ్ల బాలుడు ప్రేమ్‌చంద్‌పై వీధి కుక్కలు దాడి చేయడంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా తీసుకున్న ఎస్‌హెచ్‌ఆర్‌సీ.. ఈ నెల 29లోపు నివేదిక ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, బాలుడి ప్రస్తుత పరిస్థితి, కుక్కల స్టెరిలైజేషన్, నియంత్రణ చర్యల స్థితిని నివేదికలో పేర్కొనాలని ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశాల అమలు పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరింది.

# బీజాపూర్‌లో మరోసారి ఎదురుకాల్పులు..
## 19కి చేరిన మావోయిస్టుల మృతులు

మొదటిపేజీ తరువాయి

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్-దంతెవాడ సరిహద్దు అడవుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య మరోసారి ఎదురు కాల్పులు జరిగాయి. బుధవారం జరిగిన ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) జవాన్లు మృతి చెందారు. గురువారం నాటికి మృతుల సంఖ్య మరింత పెరిగింది. మొత్తంగా బుధ, గురువారాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 19 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి మావోయిస్టుల మృతదేహాలతో పాటు పెద్దఎత్తున ఆయుధ, పేలుడు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన డీఆర్‌జీ జవాన్లు మోను వడాడి, దుకారు గోండె, రమేశ్ సోడి మృతదేహాలను బీజాపూర్‌లోని పోలీసు లైన్‌కు గురువారం తీసుకువచ్చారు. అక్కడ వారికి పోలీసు, జిల్లా ఉన్నతాధికారులు నివాళి అర్పించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# గుర్తింపు కోసం నేను పనిచేయను..

మొదటిపేజీ తరువాయి

'క్వాంటం సిటీ'గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించా మన్నారు. గచ్చిబౌలిలోని 'ఐఐటీ హైదరాబాద్'లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్టక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశర చేసే 'డైరెక్షన్' అని అన్నారు. ఈ టెక్నాలజీ లో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా 'సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్'కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. 'ఇండస్ట్రీ డే' పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు.

## యువకుడి ప్రాణం తీసిన వీధికుక్కలు



**కరపత్రం భూపాలపల్లి ప్రతినిధి**
యువకుడి ప్రాణం తీసిన వీధికుక్కలు గీసుకొండ మండలం ఎలుకుర్తి గ్రామానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి శివకుమార్ (24) అర్ధరాత్రి ఒంటిగంటకు ఇంటికి తిరిగి వస్తుండగా, మచ్చాపురం-ఎలుకుర్తి మార్గంలో వీధి కుక్కలు అతని ద్విచక్ర వాహనాన్ని వెంబడించాయి. దీంతో బైక్ అదుపుతప్పి మట్టి దిబ్బను ఢీకొని రోడ్డు పక్కన ఉన్న మురికి కాలువలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

# రేగొండలో మొదలైన ఎన్నికల ప్రచారం



**కరపత్రం భూపాలపల్లి ప్రతినిధి**
రేగొండ సర్పంచ్ అభ్యర్థులు రేగొండ, రావులపల్లి లలో ప్రజలను కలిసి వారి అభిప్రాయాలను సేకరిస్తూ, మద్దతు కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.
గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, శుభ్రమైన రహదారులు, మంచినీటి సౌకర్యం, సంక్షేమ పథకాల సక్రమ అమలుకు కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు.
రాబోయే ఎన్నికలలో ఓటు వేయాలని ఎవరికి వారు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

### ▪ భూపాలపల్లి జిల్లాలో మూడో విడత నామినేషన్ల ప్రారంభం

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్, మహా ముత్తారం, కాటారం, మలహర్ రావు మండలాలలో పంచాయతీ ఎన్నికల మూడో విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది.
అయితే, నామినేషన్ల పర్వం మందకొడిగా కొనసాగింది. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా, అర్హులైన అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. ఎన్నికల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

### ▪ రేగొండలో మొదలైన ఎన్నికల ప్రచారం

రేగొండ సర్పంచ్ అభ్యర్థులు రేగొండ, రావులపల్లి లలో ప్రజలను కలిసి వారి అభిప్రాయాలను సేకరిస్తూ, మద్దతు కోరుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.
గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, శుభ్రమైన రహదారులు, మంచినీటి సౌకర్యం, సంక్షేమ పథకాల సక్రమ అమలుకు కృషి చేస్తామని హామీ ఇస్తున్నారు.
రాబోయే ఎన్నికలలో ఓటు వేయాలని ఎవరికి వారు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు."

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన

» హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్





**కరపత్రం భూపాలపల్లి ప్రతినిధి**
హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. దామెర, ల్యాదెళ్ళ, ఒగ్లాపూర్, దమ్మన్నపేట గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తున్న రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ పర్యవేక్షించారు.

# జోహో కంపెనీలో ఉద్యోగానికి డిగ్రీ అవసరం లేదు

– జోహో ఫౌండర్ శ్రీధర్ వెంబు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

» డిగ్రీలు చదవాలని పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి చేయవద్దని విజ్ఞప్తి
» అమెరికాలో తెలివైన విద్యార్థులు కళాశాలకు వెళ్లడం మానేస్తున్నారని వ్యాఖ్య
» ముందు చూపు కలిగిన సంస్థలు తెలివైన వారికి అవకాశం ఇస్తున్నాయని వెల్లడి




తన కంపెనీలో ఉద్యోగానికి డిగ్రీ అవసరం లేదని జోహో కార్పొరేషన్ సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు స్పష్టం చేశారు. ఆయన తరుచూ సామాజిక మాధ్యమాల్లో తన అభిప్రాయాలను పంచుకుంటారు. తాజాగా డిగ్రీ చదువుల గురించి 'ఎక్స్' వేదికగా స్పందించారు.
తమ సంస్థలో ఉద్యోగం పొందడానికి డిగ్రీ తప్పనిసరి కాదని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ చదవాలంటూ పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి చేయకూడదని సూచించారు. ప్రస్తుతం అమెరికాలో కొంతమంది ప్రతిభావంతులైన విద్యార్థులు కళాశాలలకు వెళ్లడం మానేస్తున్నారని, ముందుచూపు కలిగిన సంస్థలు వారికి అవకాశాలు కల్పిస్తున్నాయని ఆయన అన్నారు. ఒక కాగితం ముక్క కంటే ప్రతిభ, నేర్చుకోవాలనే ఆసక్తి చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. డిగ్రీల కోసం అప్పులు చేసే బదులు, ఆచరణాత్మక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం మేలని, దీని ద్వారా యువత ప్రపంచాన్ని చూసే విధానం మారుతుందని ఆయన అన్నారు.
ఈ తరహా మార్పును తల్లిదండ్రులు అర్థం చేసుకొని, పిల్లలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలని శ్రీధర్ వెంబు సూచించారు.
మన దేశంలో ఇలాంటి ఆలోచనా ధోరణి ఉండాలని, ఉద్యోగంలోనే నేర్చుకునే అవకాశాన్ని జోహో వంటి సంస్థలు కల్పిస్తున్నాయని ఒక నెటిజన్ వ్యాఖ్యానించారు.

## మద్యం దుకాణం తరలించాలని

– ఐలాపూర్ మహిళల ఆందోళన



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో మద్యం దుకాణం తరలించాలని మహిళలు గురువారం సాయంత్రం గ్రామ ప్రధాన రహదారిపై భారీగా ధర్నా చేపట్టారు. మద్యం దుకాణం వల్ల కాలనిలో తీవ్ర ఇబ్బందులు, కుటుంబ కలహాలు, పిల్లలు వ్యసనాలకు గురయ్యే ప్రమాదం, మహిళల భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళనకారులు తెలిపారు. సర్పంచ్ అభ్యర్థులు తమ సమస్యను పరిష్కరిస్తే వారికే ఓటు వేస్తామని మహిళలు పేర్కొన్నారు. "మద్యం మాకు ముప్పు… దుకాణం వెంటనే మూసేయాలి" అని వారు నినాదాలు చేశారు.

## గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠా అరెస్టు



**కరపత్రం పరకాల ప్రతినిధి**
గీసుగొండ పోలీసులు గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులతో పాటు, వారికి సహకరించిన మరో నిందితుడిని 5 గురుని అరెస్టు చేశారు. వీరి నుండి సుమారు 1,60,000 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇల్లందు, వర్ధన్నపేట, వరంగల్ జిల్లాకు చెందిన వీరిని పోలీసులు గుర్తించారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను మామూనూర్ ఏసీపీ వెంకటేశ్ గారు వెల్లడించారు.

## చింతలపేట సర్పంచ్, ఉపసర్పంచ్ ఏకగ్రీవం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి.**



మెట్ పల్లి మండలం చింతలపేట గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థి తోట్ల చిన్నయ్య, ఉప సర్పంచ్ గా బోత్కూరి లింగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. కొత్త సర్పంచ్ గ్రామాభివృద్ధి, స్వచ్ఛత, తాగునీరు, రహదారులు, విద్యుత్ సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ రావు నూతన సర్పంచ్, ఉపసర్పంచ్ లను సన్మానించి, గ్రామాభివృద్ధికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఏకగ్రీవం నేపథ్యంలో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

## జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి

– ప్రభుత్వంపై TUWJ ఆగ్రహం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జల్లి హరినాథ్ ఆధ్వర్యంలో మేడ్చల్ మండల విలేకరులు, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ధర్నాలో పాల్గొన్నారు. గత 20 నెలలుగా కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయకపోవడం, హెల్త్ కార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించడంపై జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేసారు.

## చలాన్లపై రాయితీ వార్తల ప్రచారం అలాంటిదేమీ లేదని ఖండించిన ట్రాఫిక్ విభాగం

ట్రాఫిక్ చలాన్లపై భారీ తగ్గింపుల పేరుతో తిరుగుతున్న ఈ ప్రచారం మొత్తం ఫేక్ అని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. పెండింగ్ చలాన్లు క్లియర్ చేసేందుకు ఇది మంచి అవకాశం అనుకుంటున్న వాహనదారులు అసత్య సమాచారానికి గురికావద్దని విజ్ఞప్తి చేశారు.ఇటీవలి రోజుల్లో ఇంటర్నెట్‌లో డిసెంబర్ 13న చలాన్లపై పూర్తి రాయితీలు ఇస్తున్నారంటూ వేగంగా ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు తమ అధికారిక ట్విట్టర్ ద్వారా స్పష్టతనిచ్చారు. ఆ తేదీన ఎలాంటి లోక్ అదాలత్ నిర్వహించడంలేదని, చలాన్లపై రాయితీలకు సంబంధించిన ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ ఇప్పటివరకు జారీ కాలేదని తెలిపారు. ప్రజలు ఇలాంటి తప్పుడు పోస్టులను నమ్మకుండా, మరెవరికి పంపకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఇక తరచూ చలాన్లపై డిస్కౌంట్లు ప్రకటించడం సరికాదని, అలాంటి రాయితీలు వాహనదారుల్లో భయం తగ్గించి నిబంధనల ఉల్లంఘనలు పెరిగే అవకాశముందని హైకోర్టు ఇప్పటికే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ట్రాఫిక్ చలాన్లపై ఎలాంటి రాయితీ లేదు. పెండింగ్ చలాన్ల గురించి నమ్మకమైన, అధికారిక సమాచారం కోసం మాత్రమే పోలీసుల వెబ్‌సైట్‌లు, యాప్‌లను వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఉద్యోగాల పేరిట ఎర సైబర్ క్రైమ్ ఉచ్చులో దింపడం

**మోసగాళ్ల ముఠా గుట్టు రట్టు**
నిరుద్యోగులే వారి టార్గెట్.. విదేశాల్లో మంచి ఉద్యోగం అని చెబుతారు.. లక్షల్లో జీతం, అన్ని రకాల సౌకర్యాలుంటాయని నమ్మబలుకుతారు..విదేశాలకు పంపిస్తారు.. విదేశాల్లో ఉద్యోగం అని ఎన్నో ఆశలతో వెళ్లిన నిరుద్యోగులకు చేయకూడని పనులన్నీ చేయిస్తారు. విదేశీ ఉద్యోగం పేరుతో సైబర్ క్రైమ్ కాల్ సెంటర్లకు నిరుద్యోగ యువతను పంపుతున్న మోసగాళ్ల ముఠా గుట్టు రట్టు అయింది. నిరుద్యోగ యువతను ఆకర్షించి మోసాలకు పాల్పడుగున్న సైబర్ క్రైం ఏజెంట్ల గ్యాంగ్ ను పోలీసులు పట్టుకున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి అక్కడ సైబర్ క్రైం చేయిస్తున్న ఏజెంట్ల గ్యాంగ్ ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఉద్యోగాల పేరుతో యువతను మియన్మార్, థాయ్‌లాండ్‌కు తరలిస్తున్న హైదరాబాద్, విశాఖపట్నం, మైసూర్ కు చెందిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. సైబర్ నేరాలకు సంబంధించి ఈ గ్యాంగ్ పై పలు కేసులు నమోదు చేశారు. విదేశీ ఉద్యోగాల పేరుతో పొంచివున్న ప్రమాదంపై యువత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

## రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

– మెటుపల్లి బిజెపి



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పాత బస్టాండ్‌లో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బోడ్ల రమేష్ మాట్లాడుతూ, హిందూ దేవుళ్లపై అవహేళన చేసిన రేవంత్ రెడ్డి హిందువులకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లిం, క్రిస్టియన్ మతస్తుల గురించి ఎందుకు మాట్లాడలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ హిందూ ఓట్లను వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత హిందువులను ఇలా అవహేళన చేయడం సరైన పద్ధతి కాదని, ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఇలా మాట్లాడటం సరికాదని, ముస్లిం, క్రిస్టియన్ ఓట్లు వేస్తేనే అధికారంలోకి వచ్చారా అని బోడ్ల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

## కోరుట్ల అయ్యప్ప ఆలయానికి విరాళం



**కొండబత్తిని అమర్ నాథ్,కరపత్రం కోరుట్ల**
కోరుట్ల పట్టణంలో నూతనంగా రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ద్వాదశ జ్యోతిర్లింగ సహిత శ్రీ శివాలయానికి, పట్టణ వాస్తవ్యులు, మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, గురుస్వామి శ్రీ క్యాతం వెంకయ్య-లక్ష్మి దంపతులు తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ.21,116 విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని దేవాలయం కమిటీ అధ్యక్షులు గురుస్వామి అంబటి శ్రీనివాస్ కు వారు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యవర్గం, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం సభ్యులు పాల్గొన్నారు.

## సర్పంచ్ పదవి కోసం కుటుంబ పోటీ

**– ఒకే కుటుంబం నుంచి బరిలో ముగ్గురు**

తెలంగాణలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో చిత్ర, విచిత్ర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఓ గ్రామంలో సర్పంచ్ బరిలో తల్లి, కూతుర్లు పోటీ చేస్తుండగా మరో చోట అన్నా, చెలలెలు పోటీ చేస్తుండడంతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు మరింత రసవత్తరంగా మారుతున్నాయి. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం తిమ్మయపల్లిలో తల్లి, కూతురు పోటీ చేస్తుండగా గుమ్లాపూర్ లో సొంత అన్నా, చె÷-లలెలు సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచారు. అయితే, సర్పంచ్ ఎస్సీ జనరల్ కు ముగ్గురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బరిలో నిలబడ్డారు. తెడ్డు శివకుమార్ తో పాటు సొంత చెల్లెలు రౌట్ల స్రవంతి, స్రవంతి పెద్ద నాన్న కుమారుడు తెడ్డు రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఇక, సర్పంచ్ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పోటీ చేస్తుండగా సర్పంచ్ పదవి ఎవరిని వరించబోతుందని జిల్లా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

## మాజీ సీఎం రోశయ్య వర్ధంతి వేడుకలు

» నివాళులు అర్పించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్,



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతిని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పూలమాల వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అండ్ క్రీడల శాఖ అధికారి రాందాస్, ఏవో రాంరెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖమ్మం గణేష్ తాత ఖమ్మం వెంకటయ్య బుధవారం మరణించగా వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించి, వెంకటయ్య భౌతికకాయానికి నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కాంగ్రెస్ నాయకులు తూం మధు, సంఘ స్వామి యాదవ్ తదితరులున్నారు.

## కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ అర్బన్ మండలం అనుపురం, బోయినపల్లి మండలం మానువాడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 గా నిర్ణయించిందని తెలిపారు. రైతులు తమ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి తహసీల్దార్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్య స్వామికి ఫలపంచామృతాభిషేకం



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 4**
సుబ్రహ్మణ్య స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తున్న ఆలయ పూజారి
కృతికా నక్షత్రం పురస్కరించుకుని గురువారం కరీంనగర్ నగునూర్‌లోని పరివార సమేత దుర్గాభవానీ దేవాలయంలోని ఉమాసుతుడైన శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారలకు ఆలయ అర్చకులు స్వామి వారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారలకు నూతన వస్త్రాలంకరణ చేసి విశేష హారతి, ప్రత్యేక పూజలు చేసారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగళ లక్ష్మన్, కమిటి సభ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతితోపాటు భక్తులు పాల్గోన్నారు.


## పరీక్ష ప్యాడ్లు పంపిణీ




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 4**
కీర్తిశేషులు నరహరి భరత్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని భరత్ రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గురువారం కొత్త పెల్లి మండలం మల్కాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు , నోట్ బుక్ పండ్లు, అన్ని తరగతుల విద్యార్థులకు, నోటుబుక్ పండ్లు, పండ్లు వితరణ చేసినారు. ఈ కార్యక్రమంలో నరహరి లక్ష్మారెడ్డి, రాళ్ల బండి శంకర్ ప్రసాద్ రెడ్డి, బొంగోని పరశురాములు, ప్రధానోపాధ్యాయులు భీమేష్, ఉపాధ్యాయులుశ్రీనివాస్, విజయలక్ష్మి ,హాజీ పాషా, అల్లాద్దీన్ ,అనిత, రజిని ,స్వాతి ,ఓం ప్రకాష్ ,రాజేష్ విద్యార్థులుపాల్గొన్నారు

# మెదక్ జిల్లా లోనిపలు మండలాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు

- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్
- మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు





**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట డిసెంబర్ 4**
మెదక్ నియోజకవర్గంలోని గురువారం నాడు శివయ్య పల్లి,బోల్లారం,కోరివిపల్లి, చిన్న శంకరంపేట్, రామాయంపేట మండలకు చెందిన 500 మంది బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి, అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించిన మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లిహనుమంతరావు,మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మెదక్ నియోజకవర్గంలో స్థానిక ఎన్నికల వేళ రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. వివిధ గ్రామాల నుండి సుమారు 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడం ఎంతో ఆనందంగా ఉంది. గ్రామ అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తాం. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం పెంచుకోవడం ఇదే నిదర్శనం అని అన్నారు..గ్రామ పంచాయతీ ప్రజలను ఏకం చేసి అభివృద్ధి వైపు దృష్టి సారించేలాప్రోత్సహించేందుకు, పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను మెజారిటీ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావాలని ఆదేశించారు.ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, గ్రామాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మెదక్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేసినారు.
ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు , యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## 27 అడుగుల గణపతి విగ్రహ నిర్మాణ శంకుస్థాపన



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని డిసెంబర్ 04:**
గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని టీ%-%జంక్షన్ వద్ద 27 అడుగుల ఎత్తైన శ్రీ గణపతి విగ్రహ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, మనాలి రాజ్ ఠాకూర్ పాల్గొని కొబ్బరికాయలు కొట్టి, మంత్రోఛ్ఛారణల మధ్య విగ్రహ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ రామగుండం అభివృద్ధి కోసం ఏ పని అవసరమైతే అది వెంటనే చేసి చూపుతున్నామని, రేయింబవళ్లు మా టీమ్ పని చేస్తోందన్నారు. హైమాస్ట్ లైట్లు, డ్రైనేజీ లైన్లు, సీసీ రోడ్లు, వాటర్ లైన్లు, ప్రజలు కోరితే పని వెంటనే పూర్తి అవుతుందనే నమ్మకం ఈ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రతి వాడిలో లైటింగ్ వ్యవస్థ బలపరచడం, శుభ్రతపై దృష్టి, కాలనీల్లో రోడ్లు, ఈ పనులన్నింటినీ మా ప్రభుత్వం ప్రాముఖ్యంగా తీసుకుందన్నారు. వచ్చే నెలల్లో ఇంకా భారీ అభివృద్ధి పనులు రానున్నాయని, ప్రజలకు ఇచ్చిన ఒక్క మాట కూడా వృథా కాదన్నారు. అదేవిధంగా ప్రతిపక్షాలు ఏం మాట్లాడినా%ఔ% రామగుండం ప్రజల అభిలాషే ఇక్కడ చట్టం.
వాళ్ల మాటలు గాలిలో ఎగిరే ధూళి లాంటివని, మేము పని చేస్తామని, వాళ్లు ఫొటోలు ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పెట్టుకుంటారని,
అభివృద్ధి చూచే కళ్లే ప్రతిపక్షాలకు లేవన్నారు. 27 అడుగుల గణపతి విగ్రహం నిర్మిస్తున్నామని, ప్రతిపక్షాలు మాత్రం దేవాలయాల పేరుతో నాటకాలు చేయడమే తెలుసన్నారు. రామగుండం అభివృద్ధి కళ్లముందే కనిపిస్తోందని, అసూయ ఉన్న వాళ్లకే ఇది కనిపించదన్నారు. జనం ఇచ్చిన ఒక ఓటు శక్తితో రామగుండం ఎలా మారుతుందో రాష్ట్రానికి ఉదాహరణ అన్నారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో ఆర్జీ 1 ఏరియా జిఎం లలిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దీటి బాలరాజు, కాంట్రాక్టర్లు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువత, మహిళలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ గోశాల సంపర్క్ ప్రముఖ్ గా ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి:



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 4**
హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి ని తెలంగాణ ప్రాంత గోశాల సంపర్క్ ప్రముఖుగా నియమించడం జరిగింది.
ఈ సమావేశంలో జాతీయ గోరక్ష సహప్రముఖ కేశవ్ జి , క్షేత్ర సంఘటన మంత్రి యాదగిరి రావు ,తెలంగాణ ప్రాంత విశ్వహిందూ పరిషత్ సహకార దర్శి రమేష్ ,
తెలంగాణ ప్రాంత గోరక్ష ప్రముఖ ఈసంపల్లి వెంకన్న , తెలంగాణ ప్రాంత టోలీ సభ్యులు రాధాకృష్ణారెడ్డి , ఇతర ముఖ్య గోరక్ష రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి గత మూడు దశాబ్దాలకు పైగా గోమాత సేవలో పూర్తి సమయాన్ని తన జీవితాన్ని కేటాయించారనీ,ఉత్తర తెలంగాణలోని దాదాపు 6 ఉమ్మడి జిల్లాలో పర్యవేక్షణ ఎన్నో వేల గోమాత లను కబేళాల నుంచి కాపాడి ఎంతోమంది ఆసక్తి కలిగిన రైతులకు ఇస్తూ గో సేవను ప్రోత్సహిస్తూ, దేశీయ గోమాత సంతతిని కాపాడాలని కంకణం కట్టుకున్నారనీ ,ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తనపై ఎన్ని అక్రమ కేసులు బనాయించిన తన జీవితంలో సింహ భాగాన్ని భారతీయ దేశి గోసంతతిని కాపాడి దాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయంగా రాధాకృష్ణారెడ్డి పనిచేస్తూ వస్తున్నారు.
ఈ ఆరు జిల్లాల్లో జిల్లా స్థాయిలో మండల స్థాయిలో గ్రామస్థాయిలో కూడా కమిటీలను నియమిస్తూ ఎంతోమంది యువగోరక్షకులకు ఆదర్శంగా నిలుస్తూ వారికి ధైర్యాన్ని ఇస్తూ ప్రోత్సహిస్తూ వాళ్ళందరి వెనుక ఉండి ఆయన నడిపిస్తూ వస్తున్నారు.
రాధాకృష్ణారెడ్డి తోడ్పాటు కృషి పట్టుదల ఇవన్నీ మున్ముందు వచ్చే యువగోరక్షకులు అందరికీ ఆదర్శంగా నిలుస్తుందనీ, ఆయన భవిష్యత్తులో మరిన్ని గోమాతలను కాపాడి గో సేవలు తరించాలని ఆ భగవంతున్ని మనసారా ప్రార్థిస్తూ మన అందరి తోడ్పాటు ఉంటుందని తెలిపారు.

# కొత్తపల్లి భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా శ్రీ దత్త జయంతి వేడుకలు








**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 4**
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో కొత్తపెల్లి మాజీ సర్పంచి ముద్దుల రవీందర్ ఆధ్వర్యంలో గురువారం రోజున శ్రీ దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ విజయ భార్గవ శర్మ అర్చకులు చందర్రావులు నిర్వహించారు.
ఈ ఉత్సవాల్లో శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహాన్ని కడవేరుమచ్చేందర్ సరస్వతి అరకొండ విద్యాసాగర్ సౌమ్య బొద్దులమహేందర్ పల్లవి దంపతులు ఆలయానికి అందజేయడం జరిగింది, శ్రీ దత్తాత్రేయ స్వామి విగ్రహం మరియు,ప్రముఖ శ్రీ దత్త పుణ్యక్షేత్రం గానుగాపూర్ నుండి తీసుకువచ్చిన దత్త పాదుకలను ఆలయంలో ఊరేగించి శ్రీదత్తాత్రేయ స్వామి జయంతి ఆలయ ఆవరణలోని మేడి వృక్షం వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. శ్రీ దత్త జయంతి వేడుకలలో భక్తులందరికీ సూధం సత్యనారాయణ శ్రీదేవి దంపతులు పులిహోర ,రవ్వ కేసరి ప్రసాదాలను అందజేశారు ఈ కార్యక్రమంలో కొత్తపెల్లి మాజీ సర్పంచ్ బొద్దుల రవీందర్ అరుణ దంపతులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు